క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



మక్తల్: ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మక్తల్ పట్టణానికి వచ్చిన సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేను కాంగ్రెస్ కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆయన గెలుపుకోసం కృషిచేసిన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాగనూర్: మక్తల్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా వాకిటి శ్రీహరిని ఆదివారం ఎస్ఐ మల్లేష్ మక్తల్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రం అన్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. పట్టణంలోని గీతా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలోని వైద్యబృందం కిడ్నీ, రక్తపోటు, మధుమేహం, చర్మ సంబంధ వ్యాధి, స్త్రీల సమస్యలపై అవగాహన కల్పించారు. దాదాపు 350మంది వైద్యపరీక్షలు నిర్వహించుకోగా వారికి ఉచితంగా మందులు అందజేశారు. పారిశుద్ధ్యం, వ్యాయామం ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో గ్రామ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సతీష్‌రెడ్డి, అన్వర్, రాజేష్, అంజయ్య, సాబన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మరికల్: యాసంగిలో కోయిల్‌సాగర్ నీటిని విడుదలచేసి రైతులను ఆదుకోవాలని పూసల్ పహాడ్ సర్పంచ్ యదమ్మ, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి ఆదివారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిపత్రం అందజేశారు. యాసంగిలో పూసల్‌పహాడ్, రాకొండ, గోటూర్ తదితర గ్రామాల్లో కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద వరిపంటలు సాగు చేస్తామన్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకులంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

దామరగిద్ద: ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా దామరగిద్దకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి వస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి శ్రీనివాస్, ఖాజా, రఘు తెలిపారు. ఉదయం 8గంటలకు మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో పూజలుచేసి స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం యానగుంది సూర్యనంది క్షేత్రంలోని మాత మాణికేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నట్లు తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



ఊట్కూరు: మండల పరిధిలోని కొల్లూరులో ఆదివారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శంకర్‌రెడ్డి మనుమడి పెళ్లికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు అనిల్‌కుమార్‌రెడ్డి రాధను ఆశీర్వదించారు. వీరితోపాటు జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ఎంపీపీ ఎల్లగౌడ్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

అమరచింత: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన తిరుమల శేఖర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుడి కుటుంబం చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తుండటంతో ప్రభుత్వ పరంగా రావల్సిన బీమాను వర్తింపచేసి ఆదుకుంటామన్నారు. చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్యతో ఫోన్‌లో మాట్లాడి చేనేత బీమా వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలని తెలిపారు. తక్షణ సాయంగా రూ.10వేలను అందించారు. ఎమ్మెల్యే వెంట అయ్యుబ్‌ఖాన్, మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, విష్ణు, జుబేర్ ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

మహమ్మదాబాద్: విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన చౌదర్‌పల్లి గుంగ్యాతండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన బాలునాయక్ గేదెను పొలం దగ్గర కట్టేశాడు. కాగా ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో వైర్ల కింద ఉన్న గేదెకు షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

వరి సాగులో నారుమడి కీలకం

- నేలను బట్టి విత్తనాలు ఎంచుకోవాలి
- పచ్చిరొట్ట సాగుతో దిగుబడులు



నారుమడిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారులు

మాగనూర్: యాసంగి సీజన్‌లో పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు వాతావరణంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విత్తనాల ఎంపిక, నారుమడి తయారీ, విత్తనాలు విత్తుకునే అంశాలపై సరైన అవగాహన కలిగి ఉండటం తప్పనిసరని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సూచిస్తున్నారు. ఉమ్మడి మాగనూర్ మండలంలో 24వేల ఎకరాలు వరిసాగులోకి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వరిసాగుచేసే ముందు రైతులు నారుమడిపై దృష్టిసారించాలని అధికారులు అంటున్నారు. నేలను బట్టి విత్తనాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు.

ఒకే మడిలో వేయకూడదు..

ఎప్పటికీ ఒకే పొలంలో నారుమడి చేయకూడదు. ప్రతి ఏడు మడులను మార్చాలి. అప్పుడే నారు ఏపుగా వస్తుంది. నారుమడి కోసం నీళ్ల పెట్టి కలియదున్నాలి. ఎత్తులు, వంపులు లేకుండా సరిచేసుకోవాలి. మడి దున్నిన వారం తర్వాత మొలక అలకాలి. అనంతరం ఐదురోజుల వరకు నీరు పెట్టి తీసివేస్తూ ఉండాలి. నాటు వేసే వారం ముందు 3జీ కార్బోఫ్యూరిడాన్ గుళికలు ఎకరాకు కిలో చొప్పున నారుమడిలో చల్లాలి. దీంతో నారు మడిలోని పురుగులు నివారించొచ్చు. ఈ పద్ధతి పాటించకపోతే నాటు వేసిన తర్వాత పొలంలో పురుగులు వృద్ధి చెందుతాయి. నెలకు అనువైన విత్తనాలు మాత్రమే ఎంపిక చేసుకోవడం మంచిది. అయితే మార్కెట్లో విత్తనశుద్ధి చేసిన విత్తనాలే లభిస్తున్నాయి. ఒకవేళ పండించిన విత్తనాలు ఉంటే విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి.

విత్తనాల సేకరణపై దృష్టి

పంటల సాగుకు ముందస్తుగా రైతులూ తమకు కావాల్సిన విత్తనాలు సేకరించుకోవడం ముఖ్యంగా భావించాలి. వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండిన తర్వాత నెమ్మదిగా విత్తనాల సేకరణ సిద్ధపడవద్దు. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. పంటకాలం పూర్తయ్యే వరకు రసీదును భద్రంగా ఉంచుకోవాలి.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత

పంటపొలంలో సేంద్రియ ఎరువులు పెంచుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను వేసుకోవాలి. విత్తుకున్నాక 20నుంచి 30రోజుల తర్వాత నెలలో కలియదున్నాలి. వీటితో దిగుబడులు అధికంగా వస్తాయి.

నారుమడి విత్తుకాలం

నారుమడి సరైన సమయంలో విత్తుకోవడం మంచి పద్ధతి. జూన్ 20నుంచి జూలై 15వరకు (మధ్య స్వల్పకాలిక రకాలు) ఆగస్టులో (అతి స్వల్పకాలిక రకాలు) విత్తుకోవాలి. కాలానుగుణంగా విత్తుకోవడంతో ప్రయోజనం ఉంటుంది. సాధారణంగా జూలై అఖరు వరకు నారుమడి తయారు చేసుకోవడంతో ఉపయుక్తంగా ఉంటుంది.

నేరుగా విత్తుకోవడం శ్రేయస్కరం

పంటసాగులో ఏటా కూలీల సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగి రైతులపై ఆర్థికభారం పడుతోంది. ఇందుకు వెదజల్లే మార్గాన్ని అనుసరించాలి. నారుమడి కంటే నేరుగా విత్తుకునే పద్ధతి సులువైనది. తొందరగా వేసుకునే వీలుంటుంది. ఎలాంటి ఆలస్యం లేకుండా సరైన సమయంలో పంటను మొదలు పెట్టవచ్చు. నేరుగా విత్తుకునే విధానంలో కూలీల సంఖ్య, ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే మేలు..



నారుమడి సాగు సమయంలో వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ఎంతో మేలు. రైతులు ఎప్పటి ఒకే పొలం మడిలో నారుమడి చేయకుండా వేరే మడిలో వేయడం మంచిది. విత్తనాలు ప్రభుత్వం అనుమతి పొందిన ఫర్టిలైజర్ షాపులో తీసుకోవడం మంచిది. రైతులు తమ ప్రాంతంలోని నెలలను బట్టి విత్తనాల ఎంపిక చేసుకోవడం అవసరం.

- సుదర్శన్‌గౌడ్, మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి

ట్రాఫిక్‌కు ఆటంకం కల్గించొద్దు



బండి వ్యాపారికి సూచనలు చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

నారాయణపేట రూరల్: పట్టణంలోని వాహనాలు నడిపే చోదకులు, ఫుట్‌పాత్ వ్యాపారస్తులు రోడ్లపైట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఇష్టారీతిగా ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేసిన వారికి, తోపుడు బండ్లను రోడ్డుపై నిలిపి వ్యాపారం చేసే వారికి, దుకాణాల ముందు వస్తువులను పెట్టిన యజమానులకు అవగాహన కల్పించారు. సూచించిన స్థలాల్లో అమ్మకాలు సాగించాలని, పరిధికిమించి ముందుకు వస్తే జరిమానాలు వేస్తామని, సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కానిస్టేబుళ్లు తిరుపతి, దేవేందర్, భగవంతు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ, మద్దూరు జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, పురుషోత్తంలో కలిసి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినట్లు వారు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికోసం ప్రత్యేకాధికారిని నియమించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సీఎం తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుత్ వృథా..

- పట్టించుకోని అధికారులు



వడ్వాట్‌లో పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగులను విరజిమ్ముతున్నాయి. నిరంతరాయంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24గంటలపాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసి, చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో వీధి దీపాలను ఆన్ చేసి ఉదయం వేళల్లో బంద్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



మక్తల్‌లో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

మక్తల్: మండలంలోని గుడిగండ్లలో ఆదివారం భక్తులు అయ్యప్పస్వామి పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో కలశంతో ఊరేగింపుగా వెళ్లి అయ్యప్పస్వామివారికి అభిషేకం పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆత్మకూర్: స్వామియేయ్ శరణం అయ్యప్ప అంటు అయ్యప్ప మాలాధారులు, దీక్షపరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, హోటల్ రాజుల నివాసాల్లో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు అలాగే ఆత్మకూర్‌లోని అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతినిత్యం పూజకార్యక్రమాలతోపాటు దీక్షపరులకు అన్నదానం(భిక్ష) కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు కూరగయల రఘు, ఎస్టీడీశ్రీను, జిన్నారంశ్రీను, శ్రీకాంత్, బాలు, భరత్, బాబు, నరేష్‌రెడ్డి, పాండు, శ్రవణ్, మెకానిక్‌శ్రీను, దీక్షపరులు ఉన్నారు.

అధ్వానంగా రామన్‌పాడు దారి



ఆత్మకూర్: ఆత్మకూర్ నుంచి రామన్‌పాడ్ ప్రాజెక్టుకు మార్గం అధ్వానంగా మారింది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఆరోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపుల ముళ్లపొదలు రోడ్డుకు కప్పేశాయి. దీనికి తోడు రోడ్డంతా గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇది వరకే ముల్లపొదల తొలగింపు, మరమ్మతులకు రూ.లక్షల నిధులు మంజూరైన పనులు చేయకుండానే ఆ నిధులను పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పీజేపీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయడంతో పాటు ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావటంతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుని.. విందులు ఏర్పాటు చేసుకొనేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

చిత్రకారుడికి సన్మానం



మహేష్‌కుమార్‌ను డాక్టర్ కేవి.వరప్రసాద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: బాల సాహిత్య గ్రంథం 'పిల్లల పాటల పరిమళం' పుస్తకానికి చిత్రాలు వేసిన జిల్లా చిత్రకారుడు మహేష్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సన్మానించారు. శాంతా-వసంతా ట్రస్ట్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ కేవి.వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అహంకారానికి గుణపాఠం



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారానికి ప్రజలు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. చెరువులు, కుంటల భూములను కబ్జా చేసి బీఆర్ఎస్ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని.. వాటిపై విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. మాజీ మంత్రుల పేషీల్లో మాయమవుతున్న ఫైళ్ల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండురోజులు గడువక ముందే మాజీ మంత్రి హరీష్‌రావు రైతుబంధుపై మాట్లాడటం సిగ్గు చేటన్నారు. జిల్లా కార్యదర్శి బాలకిషన్, డి.రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు.. బోర్డులు తప్ప ఆటలు లేవు

మాగనూర్: క్రీడలను ప్రోత్సహించి టాలెంట్ ఉన్న క్రీడాకారులను పైకి తేవాలని లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణాల్లోని ప్రతి వార్డులో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం కింద ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఒక ఎకరం విస్తీర్ణంలో ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని, అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు, లాంగ్‌జంప్ పిట్‌లతోపాటు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. వీటితోపాటు చుట్టు ఫెన్సింగ్ మాదిరిగా కానుగ, వెదురు, తంగెడు మొదలగు మొక్కలను పెంచాలని నిర్ణయించారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అవి ఎక్కడ కూడా కార్యరూపం దాల్చడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రస్తుతం అవి రైతులకు పంట నూర్పిళ్ల కోసం కల్లాలుగా ఉపయోగపడుతున్నాయి. ప్రతి గ్రామంలోను అదే చిత్రం కనిపిస్తుందని గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



పర్మన్‌దొడ్డిలో క్రీడాప్రాంగణంలో ఇలా..

ప్రాణాలు పోతున్నా పట్టింపేది ?



నవాబుపేట యన్మన్‌గండ్ల మలుపులు



చిక్కుడు వాగు సమీపంలో..



మైసమ్మ అడవి ప్రాంతంలో ..

- ప్రమాదకర మలుపులతో నవాబుపేట- మహబూబ్‌నగర్ రోడ్డు
- ఎక్కడా కానరాని సూచికబోర్డులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు

నవాబుపేట: మహబూబ్‌నగర్- నవాబ్‌పేట్ రోడ్డు ప్రమాదకర మలుపులతో ప్రయాణికుల్లో గుబులు పుట్టిస్తోంది. నల్లమల్ల ఘాట్‌రోడ్డును గుర్తుకు తెచ్చే ఈ దారిలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అడుగడుగునా మలుపులతో పాటు, మరమ్మతుకు గురైన కల్వర్టులతో ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ దారిపై ప్రాణాలు అరచేత పెట్టుకుని ప్రయాణం చేయాల్సిందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుపై కొత్త ప్రయాణించేవారు అవగాహన లోపంతో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల రుద్రారం గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి రాత్రి సమయంలో కల్వర్టు దగ్గర ఎలాంటి సూచికలు లేకపోవడంతో గుర్తించక అందులో పడి మృతిచెందిన ఘటననే ఉదాహరణ అని అంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ పాలకులకు, అధికారులకు ఎలాంటి పట్టింపు లేకుండా పోయింది. కనీసం సూచిక బోర్డులు, వేగనిరోధకాలు వంటివి ఎక్కడా ఏర్పాటు చేయలేదు. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నప్పుడైతే రోజుకో ప్రమాదం జరిగేది. ప్రస్తుతం డబుల్ రోడ్డు మార్చాక ఈ తీవ్రత కొంత తగ్గినప్పటికీ.. మలుపుల వద్ద వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదాల స్థలంలోనే సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయడం మరిచారని పలువురు ఆరోపిస్తున్నారు. నవాబుపేట నుంచి యన్మన్‌గండ్ల మలుపు, గద్దగుండు మలుపు, రుద్రారం, కాకర్లపహాడ్ మలుపు, పర్వతాపూర్ మైసమ్మ అడవి ప్రాంతం, చిక్కుడు వాగు వద్ద మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికైనా సూచికబోర్డులు, వేగనియంత్రకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి

రుద్రారం కల్వర్టు దగ్గర తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. దగ్గరకు వచ్చాకగానీ సమస్య ఉందని గుర్తించడానికి ఆస్కారం లేదు. కొత్త వారైతే కచ్చితంగా ప్రమాదం బారిన పడతారు. రోడ్డు వెంట ఎలాంటి సూచికలు లేవు, కల్వర్టు రక్షణ గోడలు సైతం లేవు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– సతీష్‌చంద్ర, నవాబుపేట

ఉన్నతాధికారులకు వివరిస్తాం

మహబూబ్‌నగర్- నవాబుపేట రోడ్డులో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. మైసమ్మ దేవాలయం ప్రాంతంలో అడవిలో అతివేగంగా వాహనాలు వెళ్తడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వేసిన కొత్తలో 5 కొన్ని చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేశాం. మరమ్మతు చేయించడంతో పాటు సమస్యలపై ఉన్నతాధికారులకు వివరిస్తాం.

–రాములు , ఇన్‌చార్జ్ ఎఈ

విద్యుత్ తీగలతో ప్రమాదం

ఆత్మకూర్: మండల పరిధిలోని కత్తేపల్లిలో చేతులెత్తితే విద్యుత్ తీగలు తగులుతున్నాయని ఇ దివరకే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు సమాచారం అందించిన పట్టించుకోవడంలేదని సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్ర మాదాలను నివారించాలని కోరుతున్నారు.